క్లుప్తంగా

బండెనక బండి కట్టి..



అమరచింత: పట్టణంలో వెలసిన శ్రీ సవారమ్మ దేవతకు మొక్కులు తీర్చుకునేందుకు పిన్నంచర్ల గ్రామానికి చెందిన రైతులు ఎడ్లబండ్లపై మేళతాళాలతో వచ్చి అమ్మవారి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి సంవత్సరం సవారమ్మ అమ్మవారికి నైవేద్యం సమర్పించి, అక్కడే వంటలు వండుకొని పిల్లపాపలతో కలిసి భోజనం చేయడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ అని పిన్నంచర్ల గ్రామస్తులు తెలిపారు.

వార్షిక బ్రహ్మోత్సవాలు



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి స్టేజీ సమీపంలో గల సుప్రసిద్ధమైన శైవక్షేత్రం కోటిలింగేశ్వర దత్త దేవస్థానం 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు రెండో రోజు వైభవోపేతంగా కొనసాగాయి. మంగళవారం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు లక్ష పుష్పార్చన నిర్వహించారు. ఆలయంలో జరుగుతున్న వివిధ పూజా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో శాస్త్రోక్తంగా పుష్పార్చన చేశారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నదానం చేశారు.

వృద్ధులకు వీల్‌చైర్స్, చేతికర్రలు అందజేత



కొత్తకోట రూరల్: మండలంలోని రామనంతాపురం గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు టీజీ మహేష్ కనిమెట్ట గ్రామానికి చెందిన 80 మంది వృద్ధులకు స్టాండ్, స్టిక్స్, వీల్‌చైర్స్‌ను అందజేశారు. సమాజ సేవలో భాగంగా ఇదివరకూ విద్యార్థులకు బుక్స్, ప్యాడ్లు, పెన్నులు అందజేశామని, అందులో భాగంగానే మంగళవారం కనిమెట్ట గ్రామానికి చెందిన వృద్ధులకు తన పుట్టిన రోజు సందర్భంగా వీల్‌చైర్స్, స్టిక్స్, స్టాండ్స్ అందజేశానని మహేష్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు చీర్ల నర్సింహ, మాజీ వైస్ ఎంపీపీ వాకిటి బాలరాజు, పరమేష్, నర్కుల యాదయ్య, లింగనాయక్, పరశురాం తదితరులు ఉన్నారు.

మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలి

వనపర్తి విద్యావిభాగం: మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నరేష్‌తేజ కోరారు. మంగళవారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో 'నక్సలైట్లు జనజీవన స్రవంతిలో కలవాలి' అనే నినాదంతో శాంతియుతంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నరేష్‌తేజ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం ద్వారా సమస్యలకు పరిష్కారం సాధ్యమని, హింస మార్గంలో దేశంలో ఏ ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ సాతర్ల అర్జున్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివ కుమార్, కార్తీక్, బంటి, పవన్, వెంకీ, భాస్కర్, వినయ్, భాను ఉన్నారు.

అంబేడ్కర్ ఆడిటోరియం నిర్మించాలి

కొత్తకోట: మండలంలోని ఎస్సీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మాజీ కౌన్సిలర్ భరత్ భూషణ్ మంగళవారం వనపర్తి జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కా వెంకటయ్యకు వినతిపత్రం అందజేశారు. మండలంలో గత బీఆర్ఎస్ పార్టీ హయాంలో అంబేడ్కర్ ఆడిటోరియం నిర్మాణం కోసం రూ.30 లక్షలు మంజూరు చేసి, అప్పటి శాసన సభ్యుడు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి శిలాఫలకాలను పాతించి శంకుస్థాపన చేశారని తెలిపారు. శంకుస్థాపన జరిగి నేటికి రెండేళ్లు గడుస్తున్నా ప్రస్తుత ప్రభుత్వం అంబేడ్కర్ ఆడిటోరియం నిర్మాణ పనుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. వెంటనే నిధులు మంజూరు చేయించి ఆడిటోరియం నిర్మాణానికి చొరువ తీసుకోవాలని కోరారు.

రూ.25 వేల విరాళం

ఖిల్లాఘనపురం: మండలంలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం కమాలోద్దీన్‌పూర్ గ్రామానికి చెందిన జయకర్‌రెడ్డి, కృపాకర్‌రెడ్డి రూ.25 వేల విరాళం అందజేశారు. మండలంలో తరుచుగా జరుగుతున్న దొంగతనాలను అరికట్టేందుకు సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని ఎస్ఐ సురేష్‌గౌడ్ కోరారు. కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రారంభానికి నోచుకోని సబ్‌స్టేషన్



అసంపూర్తిగా ఉన్న తోమాలపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్

- లోవోల్టేజీ సమస్యతో రైతుల ఇబ్బందులు
- ఎనిమిదేళ్లయినా పనుల్లో నిర్లక్ష్యం
- వినియోగంలోకి తేవాలంటున్న అన్నదాతలు

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలో రైతులు లోఓల్టేజీ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్య పరిష్కరించేందుకు మండలంలోని తోమాలపల్లిలో ఎనిమిదేళ్ల క్రితం సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థానిక ప్రజాప్రతినిధులు శ్రీకారం చుట్టారు. మండల ప్రజలు, రైతులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండొద్దని ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కానీ ఏళ్లు గడుస్తున్నా సబ్‌స్టేషన్ పనులు కొలిక్కిరాలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పనులు నత్తనడకన సాగడానికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని రైతులు మండిపడుతున్నారు. ప్రభుత్వం కోట్లు కేటాయించి రైతులకు లోవోల్టేజీ సమస్య పరిష్కారం చూపించేందుకు చర్యలు తీసుకుంటున్నా స్థానిక అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా పనుల్లో పురోగతి లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పవర్ ట్రాన్స్‌ఫార్మర్ లేక..

మండలంలో విద్యుత్‌లో లోవోల్టేజీ సమస్య పరిష్కారం కోసం గతంలో రూ. 1.70 కోట్ల నిధులతో తోమాలపల్లిలో సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టారు. కానీ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ లేక సబ్‌స్టేషన్ నిరుపయోగంగా మారింది. సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తై వినియోగంలోకి వస్తే మండలంలోని పెబ్బేరు, వై.శాఖాపూర్, రాంపురం, రామమ్మపేట, కంచిరావుపల్లితండా, తోమాలపల్లి గ్రామాల్లో లోవోల్టేజీ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. ఇప్పటికైనా సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు పూర్తిచేసి గ్రామాల్లో రైతుల ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎనిమిదేళ్లయినా..

తోమాలపల్లి శివారులోని సబ్‌స్టేషన్ పనులను త్వరగా పూర్తి చేయాలి. ఎనిమిదేళ్ల నుంచి పనులు కొనసాగుతున్నాయి. దీని కన్నా వెనుక ప్రారంభించిన గుమ్మడం సబ్‌స్టేషన్ పూర్తి చేసుకొని ప్రారంభించారు. కానీ తోమాలపల్లి సబ్‌స్టేషన్ పనులు మాత్రం పూర్తిచేయండంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. – మధు, తోమాలపల్లి

అధికారుల అలసత్వం

గ్రామాల్లో లోవోల్టేజీ సమస్యను పరిష్కరించడానికి గత ప్రభుత్వం సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేసింది. పనులు పూర్తి చేయడంలో అధికారులు విఫలమైయ్యారు. పనులు పూర్తయితే రైతులకు నాణ్యమైన విద్యుత్ అందుతుంది. అధికారులు వేగంగా స్పందించి పనులు పూర్తి చేసి సబ్‌స్టేషన్ ను వినియోగంలోకి తేవాలి
– మేకల రవికుమార్‌యాదవ్, వైశాఖాపూర్

హైవే కారణంగా..

గతంలో 33 లైన్ సమస్య ఉండేది. ప్రస్తుతం లైన్ పనులు పూర్తి చేశాం. హైవే క్రాసింగ్ కారణంగా పనులు ఆపాం. వారి అనుమతి కోసం లెటర్ పెట్టాం. అనుమతి వచ్చిన వెంటనే పనులు మొదలవుతాయి. పనులు పూర్తి చేసి త్వరలో సబ్‌స్టేషన్ వినియోగంలోకి తెస్తాం.
– శివశంకర్‌రెడ్డి, ఏడీ, కోత్తకోట

పట్టణ పరిశుభ్రతలో భాగం కావాలి

వనపర్తిటౌన్: పట్టణ పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం కీలకమని మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు మంగళవారం 100రోజుల కార్యచరణలో భాగంగా జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో తడి, పొడి చెత్తపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, డ్రెయినేజీల్లో మురుగును తీయించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కొత్తకోటలో అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ సిబ్బంది

కొత్తకోట రూరల్: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతి ఒక్కరూ సహరించాలని మున్సిపల్ కమిషనర్ సైదయ్య అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో ప్రజలకు ప్రాణాంతకమైన వ్యాధులతో అప్రమత్తంగా ఉండేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఇంటి పరిసర ప్రాంతాల్లో మురుగు చేరకుండా చూసుకోవాలని, చెత్తను డ్రెయినేజీల్లో వేయకుండా చెత్త బండిలో వేయాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటయ్య, వార్డు అధికారులు, ఇంజినీర్ శ్రీధర్, ఆర్పీలు, వైద్య సిబ్బంది ఉన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

పాన్‌గల్: అమరచింతలో ఈనెల 11వ తేదీన నిర్వహించే టీయూసీఐ జిల్లా మహాసభలకు కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు సుబయ్య, జిల్లా కన్వీనర్ పెంటయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కార్మికులతో కలిసి జిల్లా మహాసభల వాల్ పోస్టర్లను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు నాగమ్మ, దేవమ్మ, రాజు, రాములు, సూరమ్మ, నాగేంద్రం, బాలయ్య, బాలనాగమ్మ తదతరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

వీపనగండ్ల: తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని గ్రామపంచాయతీ వర్కర్లు కోరారు. మంగళవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఈ నెల 11వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో మండల పంచాయతీ వర్కర్ల అధ్యక్షుడు వెంకటయ్య, ఉపాధ్యక్షుడు రాజబాబు, ప్రధాన కార్యదర్శి మహేష్, పలువురు మహిళా వర్కర్లు పాల్గొన్నారు.

విధేయతకు గుర్తింపు

వనపర్తి: పార్టీకి విధేయులుగా పనిచేసే వారికి గుర్తింపు తప్పకుండా లభిస్తుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రానికి చెందిన నందిమళ్ల యాదయ్యను టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు యాదయ్యను మంగళవారం హైదరాబాద్‌లో శాలువాతో సత్కరించారు. యాదయ్య ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ జిల్లా మత్స్యశాఖ సెల్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. రాష్ట్రం, జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, నాయకులు పెంటన్నయాదవ్, రాములు, రాము, అబ్దుల్లా, సహదేవుడు, బాలరాజ్, భాస్కర్, విజయ్ పాల్గొన్నారు.



నందిమళ్ల యాదయ్యను సన్మానిస్తున్న డాక్టర్ జి. చిన్నారెడ్డి

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

వీపనగండ్ల: మండలంలోని రంగవరంలో ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందిన ఇద్దరికి సీఎంఆర్‌ఎఫ్ నుంచి విడుదల అయిన రూ.15,500 విలువ గల చెక్కులను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బిచ్చన్నసాగర్ మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని సూగూరుకు చెందిన అమరచింత శివలక్ష్మి అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం సీఎంఆర్‌ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. విషయాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి రూ.2లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించగా.. మంగళవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఇన్‌చార్జి కేబీ నాయుడు ఎల్‌ఓసీ కాపీని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి

వనపర్తి విద్యావిభాగం: జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలు పుట్టగొడుగుల పుట్టుకొస్తున్నాయని, అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యా దోపిడీకి గురి చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ నాయకులు డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్ పి.శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎత్తం మహేష్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో నిబంధనలు తుంగలో తొక్కి తక్కువ వేతనాలకు వచ్చే అర్హత లేని వారితో ప్రైమరీ విద్య బోధిస్తున్నారని ఆరోపించారు. పాఠశాలల్లో కనీస వసతులు లేక పోయినా ఫీజులు మాత్రం ఆకాశాన్నంటుతున్నాయని, ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. విద్యా హక్కు చట్టం ప్రకారంగా ప్రతి ప్రైవేటు పాఠశాలలో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎత్తం విష్ణు, రాజేష్, చంద్రశేఖర్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.



మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించాలి

వనపర్తి విద్యావిభాగం: జిల్లాలోని కేజీబీవీ, యూఆర్ఎస్ పాఠశాలలో పనిచేస్తున్న వంట మనుషులకు 'కామన్ న్యూ మెనూ' తయారీ విధానంపై శిక్షణ ఇచ్చినట్లు డీఈఓ అబ్దుల్‌ఘని తెలిపారు. రాష్ట్రస్థాయిలో జరిగిన శిక్షణను తిరిగి డీఆర్పీ అయిన కేజీబీవీ ఖిల్లాఘనపురం ఎస్ఓ ప్రశాంతి, వంట మనిషి కృష్ణవేణి, గోపాల్‌పేట కేజీబీవీ వంట మనిషి షాషిదాతో శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జీసీడీఓ శుభలక్ష్మి మాట్లాడుతూ శుచి, శుభ్రతతో ఎస్ఓపీ(ప్రమాణిక, ఆపరేటింగ్ ప్రక్రియ)ను పాటిస్తూ మెనూలో కొత్తగా చేర్చిన వంటకాలను విద్యార్థులకు రుచికరంగా అందిచాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఏఓ మధుసూదన్‌రెడ్డి, సెక్టోరియల్ అధికారి, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.



వనపర్తిలో వంటలు తయారు చేసే విధానాన్ని చూపిస్తున్న శిక్షకులు

పాన్‌గల్: ప్రభుత్వ పాఠశాలల్లో అందించే మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం నాణ్యతగా అందించాలని ఎంఈఓ శ్రీనివాసులు వంట ఏజెన్సీలకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో వంట ఏజెన్సీ మహిళలకు శిక్షణ ఇచ్చారు. దీంతో పాటు పారిశుద్ధ్య కార్మికులకు పాఠశాలల్లో పరిశుభ్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. సమావేశంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం విజయ్, సీఆర్పీలు గోవింద్, సంతోష్ పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: పాఠశాలల్లో విద్యార్థులకు అసౌకర్యం లేకుండా పరిశుభ్రత పనులు చేపట్టాల్సిన బాధ్యత పారిశుద్ధ్య కార్మికులదే అని ఎంఈఓ జయశంకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో పారిశుద్ధ్య కార్మికులకు శిక్షణ ఇచ్చారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న వంట ఏజెన్సీ మహిళలకు భోజనం సిద్ధం చేసేటప్పుడు తీసుకోవాలన్సిన జాగ్రత్తలు, కూరగాయల ఎంపికపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం కాళిదాసు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చక్కని విద్య

వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండలంలోని తాటిపాముల యూపీఎస్ పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లితండ్రులను కోరారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎం రామచంద్రయ్య, డీపీఎం ప్రభాకర్, ఏపీఎం శ్రీనివాసులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాములుయాదవ్, ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులకు స్కూల్ యూనిఫాంలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.



తాటిపాములలో విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న ఉపాధ్యాయులు

పారిశుద్ధ్యంపై శ్రద్ధ అవసరం

పెబ్బేరు మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ జయరాములు, రిసోర్స్‌పర్సన్ రవికుమార్ మంగళవారం పాఠశాల పరిశుభ్రత, పారిశుద్ధ్యంపై మండలంలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటర్ వర్కర్లకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య వస్తువులను పరిచయం చేశారు. కాలుష్య రహిత రసాయనాలతో టాయిలెట్లను శుభ్రం చేయాలని సూచించారు.

వీపనగండ్ల: పాఠశాలను శుభ్రపర్చడంలో స్కావెంజర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మాస్టర్ ట్రైనర్ రఘు అన్నారు. పాఠశాలలు పరిశుభ్రంగా ఉంటేనే విద్యార్థులు ఆరోగ్యకరమైన వాతావరణంలో విద్యను అభ్యసించగలుగుతారని తెలిపారు. ప్రతి ఒక్కరూ నిబంధనలకు అనుగుణంగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఆర్పీలు వెంకటేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయం ప్రారంభం

అమరచింత: మండల కేంద్రంలోని ఉర్దూమీడియం పాఠశాల వెనక నూతనంగా ఏర్పాటు చేసిన ఎంపీడీఓ కార్యాలయాన్ని మంగళవారం ఎంపీడీఓ చెన్నమ్మ చేతుల మీదుగా ప్రారంభించారు. గతంలో అద్దె భవనంలో కార్యాలయం కొనసాగుతుండగా అద్దె చెల్లించాలని పలుమార్లు ఇంటి యాజమాని కార్యాలయానికి తాళం వేసి తమ విధులకు ఆటంకం కలిగిస్తున్నాడని జిల్లా అధికారులకు విన్నవించామన్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సొంత కార్యాలయం కోసం ఉర్దూ మీడియం పాఠశాలలోని ఖాళీ తరగతి గదులను వినియోగించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. తరగతి గదులకు మరమ్మతులు చేపట్టి అన్ని వసతులను కల్పించినట్లు వారు తెలిపారు. మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు హుటాహుటిన కార్యాలయాన్ని ప్రారంభించామని కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ సురేష్, కాంగ్రెస్ మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, మాజీ ఎంపీటీసీలు మహంకాళి విష్ణు, తిరుమలేష్, రాకేష్‌గౌడ్, హనుమంతునాయక్, వెంకటేశ్వర్‌రెడ్డి, తౌఫిక్ తదితరులు పాల్గొన్నారు.



కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంపీడీఓ చెన్నమ్మ, నాయకులు

సమగ్ర ఆరోగ్య శిబిరాలను వినియోగించుకోవాలి

పాన్‌గల్: మండలంలోని వివిధ సబ్‌సెంటర్ల పరిధిలో నిర్వహిస్తున్న సమగ్ర ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని పరీక్షలు చేయించుకోవాలని సీహెచ్ఓ రామయ్య అన్నారు. మంగళవారం మండలంలోని బుసిరెడ్డిపల్లి సబ్‌సెంటర్ పరిధిలో జిల్లాలోని అనుభవజ్ఞులైన వైద్య బృందం, ఎన్‌జీఓ టీమ్ సభ్యుల సహకారంతో డయాబెటీస్, బీపీ, హిమోగ్లోబిన్, క్షయవ్యాధి నిర్ధారణకు స్పూటమ్ సేకరణ, ర్యాండమ్ బ్లడ్ పరీక్షలు, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, హెపటైటీస్–బీ మొదలగు పరీక్షలు నిర్వహించి తగు సూచనలు, సలహాలు ఇచ్చి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ వైద్యులు తారాశశాంక్, మైథిలీ, నిహారిక, ఎన్‌జీఓ టీమ్ అలిబాబు, పద్మ, కల్పన, రమాదేవి, హెచ్ఐవీ టీమ్ బండారి శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, క్షయవ్యాధి బృందం ప్రవీణ్‌కుమార్, లక్ష్మీనారాయణ, ఖాజా, నగేష్, రహ్మాన్, వైద్య సిబ్బంది సుమనశ్రీ, కళావతి, రామచంద్రయ్య, సతీష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. బుధవారం చింతకుంటలో ఆరోగ్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.



మహిళకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సేంద్రియ సాగుతో అధిక దిగుబడి

వనపర్తి రూరల్: రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి పచ్చిరొట్ట వినియోగాన్ని పెంచాలని పాలెం వ్యవసాయ కళాశాల శాస్త్రవేత డాక్టర్ రామిరెడ్డి సూచించారు. మండలంలోని పెద్దగూడెం రైతువేదిక వద్ద మంగళవారం రైతు ముంగిట్లో శాస్త్రవేతలు అనే కార్యక్రమంలో భాగంగా పాలెం వ్యవసాయ కళాశాల శాస్త్రవేతలు డాక్టర్ విజయలక్ష్మితో కలిసి ఆయన రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి రైతు తన పొలంలోని మట్టిని సేకరించి భూసార పరీక్ష చేయించుకోవాలన్నారు. దీనికి అనుగుణంగా వ్యవసాయాధికారులు సూచించిన మోతాదులో ఎరువులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ కురుమయ్య, పశు వైద్యాధికారి రాజేష్‌కన్నా, ఏఈఓ కవిత, రైతులు పాల్గొన్నారు.



పెద్దగూడెంలో మాట్లాడుతున్న డాక్టర్ విజయలక్ష్మి

విత్తన శుద్ధితో లాభాలు

విత్తన శుద్ధితో అధిక దిగుబడులు సాధించవచ్చని కేవీకే శాస్త్రవేత డాక్టర్ అనిత రైతులకు సూచించారు. మంగళవారం పెబ్బేరు మండలంలోని యాపర్ల, గుమ్మడంతండా పంచాయతీ ఆవరణలో వానాకాలం పంటలు, భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత డాక్టర్ శాంతాలక్ష్మి, పశు వైద్యులు విజయ్, ఏఈఓ ప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

గోపాల్‌పేట: రైతులు సాగులో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా దిగుబడి పెరుగుతుందని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సురేష్‌కుమార్ అన్నారు. ఏదుల మండలంలోని చెన్నారంలో రైతులు పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో ఐఎఫ్ఎఫ్‌సీఓ అధికారి రాజు, మండల వ్యవసాయ అధికారి కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సేవాభావం ఉండాలి

వనపర్తి టౌన్: రాజకీయాల్లో సేవాభావం కలిగిన వ్యక్తుల ప్రాధాన్యత పెరిగినప్పుడే ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి ఆదిత్య, ఆర్టీఏ సభ్యుడు జహంగీర్ అన్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయచందర్ జన్మదినం సందర్భంగా ఆర్‌బీ రవిసాగర్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని జిల్లా ఆస్పత్రి, చేయూత అనాథ ఆశ్రమం, వృద్ధాశ్రమంలో పండ్లు, బిస్కెట్లు, బ్రెడ్లు, ఆహార పదార్థాలతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రవియాదవ్, కృష్ణబాబు, నక్క రాములు, వినోద్‌గౌడ్, చుక్క రాజు, రంజిత్, రఘు, ఇర్ఫాన్, శివగౌడ్, కిరణ్, మోహన్, రాజ్, నరేష్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.




జిల్లా ఆస్పత్రిలో రోగుల కుటుంబ సభ్యులకు పండ్లు, బ్రెడ్లు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నేడు వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

అమరచింత: పట్టణంలోని బీసీ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం నిర్వహించే లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవానికి ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజం ఎగురవేశారు. బుధవారం ఉదయం 11:55 నిమిషాలకు స్వామివారి కల్యాణోత్సవాన్ని ఆశ్రమ వేద పండితులు బ్రహ్మశ్రీ కొల్లూరి భీమాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పారుపల్లి చింతన్న, పొబ్బతి వెంకటస్వామి తెలిపారు. బ్రహ్మశ్రీ డాక్టర్ ఉత్తరపల్లి రామాచార్యులు, జిల్లాపురం రామకృష్ణారెడ్డి బృందంచే అన్నమాచార్య సంకీర్తనలను ఆలపిస్తారన్నారు. కల్యాణానికి కూర్చునే దంపతులు రూ.516 చెల్లించి ఆలయం ద్వారా రశీదు పొందాలని సూచించారు. వేడుకలకు వచ్చిన భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందన్నారు.

ఎమర్జెన్సీ మందులు అందుబాటులో ఉంచుకోవాలి

వీపనగండ్ల: ఆరోగ్య ఉప కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్య సిబ్బంది ఎమర్జెన్సీ మందులను అందుబాటులో ఉంచుకోవాలని మానిటరింగ్ వంశీకృష్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమావేశం నిర్వహించి వైద్య సిబ్బంది, ఆశావర్కర్లకు పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని, గర్భిణులు, బాలింతల పేర్లు నమోదు చేయడంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని ప్రదర్శించరాదని ఆయన అన్నారు. అత్యవసర సమయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండని వైద్య సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయుష్ డాక్టర్ హేమవర్ధన్, శ్వేత, కరుణశ్రీ, భాగ్యశ్రీ, కవిత, కేశవులు, వైద్యాధికారులు కళమ్మ, విజయకుమారి, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా నోడల్ అధికారి వంశీకృష్ణ

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

సాక్షి, నెట్‌వర్క్: జిల్లావ్యాప్తంగా మంగళవారం రెవెన్యూ సదస్సులు కొనసాగాయి. అమరచింత మండలంలోని చంద్రగఢ్‌లో 10 దరఖాస్తులు, పాన్‌గల్ మండలంలోని మంగ్లపల్లిలో 26, చింతకుంటలో 8 దరఖాస్తులు, ఖిల్లాఘనపురం మండలంలోని మల్కాపురంలో 7, సోళీపురంలో 27, వనపర్తి మండలంలోని చిట్యాలలో 39, కడుకుంట్లలో 3, పెబ్బేరు మండలంలోని గుమ్మడంలో 8, వై.శాఖాపూర్‌లో 29, శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములలో 17 దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్లు సత్యనారాయణరెడ్డి, రమేష్‌రెడ్డి, రవికుమార్ యాదవ్, సుగుణ, మురళిగౌడ్, రాజు డీటీలు లక్ష్మీకాంత్, రెడ్యానాయక్, అశోక్‌కుమార్, చక్రపాణి, నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.



మల్కాపురంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ సుగుణ